క్లుప్తంగా

నేడు కమ్యూనిటీ హాలు ప్రారంభం

కడియం: కడియపులంకలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ భవనాన్ని ఆదివారం సాయంత్రం ప్రారంభించనున్నారు. దళిత యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు అన్ని పూర్తయ్యాయి. ఆనం ఎలక్ట్రికల్స్ అధినేతలు ప్రేమ్‌కుమార్‌రెడ్డి, జయలక్ష్మి దంపతుల విరాళం, పంచాయతీ నిధులు మొత్తం రూ.14లక్షలతో ఈ కమ్యూనిటీ హాలును నిర్మించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న దిలీప్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత కావాలని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మన భూమిని కాపాడుకోవాలని ఆయన అన్నారు. అనంతరం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, డ్రాయింగ్ టీచర్ పుప్పాల బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కడియం: నవజాత శిశువుల ఆరోగ్యం, సీజనల్ వ్యాధులపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద 108 సిబ్బంది అన్నారు. శనివారం ఆసుపత్రి ఆవరణలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. డాక్టర్ మోహనవంశీ, డాక్టర్ అరుణ, సిబ్బంది శాంతకుమార్, బుల్లిరాజు తదితరులు ఆసుపత్రికి వచ్చిన రోగులు, స్థానికులకు అవగాహన కల్పించారు.

అధికారంలోకి వస్తే ఈద్గాకు 4 ఎకరాలు ఇస్తాం

సీటీఆర్ఐ: వచ్చే 2024 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందని, వచ్చిన వెంటనే ముస్లింలకు 4 ఎకరాల స్థలం ఈద్గాకు కేటాయిస్తామని టీడీపీ నాయకుడు ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. రంజాన్ సందర్భంగా స్థానిక నెహ్రూ నగర్‌లోని ఈద్గాలో ముస్లింలు నిర్వహించిన ఈదుల్ ఫితర్ రంజాన్ వేడుకలకు ఆయన హాజరయ్యారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో రాజమహేంద్రవరం నగరంలోని పలు మసీదులు, షాదీ ఖానాలు, దర్గాలు, ఈద్గాల అభివృద్ధికి కృషి చేశానన్నారు.

వీరజవాన్లకు నివాళులు



జవాన్లకు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: ఈనెల 20న జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో అమరులైన వీరజవాన్లకు బీజేపీ జిల్లా యువ మోర్చా ఆధ్వర్యంలో శనివారం రాత్రి బొమ్మూరు సెంటర్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందుకూరి మనోజ్ కుమార్ మాట్లాడుతూ వచ్చే నెలలో జరగబోయే అంతర్జాతీయ జీ-20, శిఖరాగ్ర సమావేశం ఏర్పాటు చేశారని, ఈ సందర్భంగా భారత ప్రభుత్వాన్ని భయభ్రాంతులకు గురిచేయాలనే ఉద్దేశంతో ఉగ్రవాదులు ఈ దాడి చేశారన్నారు. ఈ దుశ్చర్యకు తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరాం, మండల బీజేపీ అధ్యక్షుడు ఎన్వీబీఎస్ ఆచారి, మల్లాడి సత్య వర ప్రసాద్, ఆకుల నరేష్, ముద్రగడ సూర్య చంద్ర మోహన్, మల్లాది శశికాంత్, బండారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చెట్లు నరికివేతపై కేసు

సీతానగరం: వంగలపూడిలోని పంటపొలంలో ఉన్న మామిడి చెట్టు, మూడు టేకు చెట్లు, నాలుగు సరుగుడు చెట్లను అల్లం వీరవెంకట సత్యనారాయణతోపాటుగా మరో ఏడుగురు నరికివేయడంతో వారిపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ టి.లోవకుమార్ శనివారం తెలిపారు. ఈనెల 12న పార్వతి తన పొలంలోకి వెళ్లిన చూడగా చెట్లు నరికివేసినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఉపాధ్యాయుడి మృతి

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు కొవ్వూరి వెంకట రాఘవరెడ్డి(51) శనివారం మృతి చెందాడు. ఆయన మోళ్లూరు ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఇంటి వద్ద బాత్‌రూంలో జారి పడగా తలకు గాయమైంది. రాజమహేంద్రవరంలోని డెల్టా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఆయనకు ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం తెలియజేశారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

- భక్తిశ్రద్ధలతో ఈద్ ఉల్ ఫితర్
- ఈద్గా, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ఈ పండగతో ముగిసిన రంజాన్ మాసం
- రూ.2 కోట్లతో షాదీ ఖానా నిర్మాణం: ఎంపీ భరత్‌రామ్



ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు



ప్రార్థనలో పాల్గొని మాట్లాడుతున్న ఎంపీ భరత్



ఈద్గా ప్రార్థనలో పాల్గొన్న షర్మిలారెడ్డి తదితరులు



ఆలింగనం చేసుకున్న చిన్నారులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ముస్లింలు ఈద్ ఉల్ ఫితర్ పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. రంజాన్ మాసం ఉపవాసాల తూచా తప్పక పాటించిన ముస్లింలు తమ ఆనందాన్ని, సంతోషాన్ని అల్లాకు కృతజ్ఞత రూపంలో చెల్లించడానికి జరుపుకొనే పండగను ఈద్ ఉల్ ఫితర్ అంటారు. శనివారం ఉదయం ఈద్గా, మసీదులలో ఈద్ ఉల్ ఫితర్ ప్రార్థనలు చేశారు. ప్రార్థనలకు ముందు ప్రవక్త మొహమ్మద్ సంప్రదాయ ప్రకారం ఖజురపు పండు సేవించి, నూతన వస్త్రాలు ధరించి, అత్తరు పూసుకొని ప్రార్థనల స్థలానికి చేరుకొని, అక్కడ సామూహిక ఈద్ నమాజ్ చేశారు. అనంతరం ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకొని, శుభాకాంక్షలు చెప్పుకున్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని అన్ని మసీదుల్లో ఈద్ ఉల్ ఫితర్‌ని ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్‌లోని ఈద్గాలో ఈ పండగను అత్యంత ఘనంగా నిర్వహించారు. వేలాది మంది ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని తమ సంతోషాన్ని వ్యక్తం చేసుకున్నారు. ఉపవాస దీక్షలో చల్లగా చూసిన అల్లాహ్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు.

ముస్లింలకు తీపి కబురు

ముస్లింల పవిత్ర రంజాన్ పర్వదిన సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలతో పాటు ఓ తీపి కబురు చెప్పారు. ముస్లింలకు అత్యంత ఆధునిక వసతులతో 'షాదీ ఖానా'ను రూ.2 కోట్లతో 31 సెంట్ల స్థలంలో నిర్మించేందుకు కావాల్సిన శాంక్షన్ ఆర్డర్స్ వచ్చినట్టు ఎంపీ భరత్ ప్రకటించారు. రాజమండ్రి నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఎదురుగా నెహ్రూ నగర్ ఈద్గా గ్రౌండ్స్‌లో ముస్లింలు నిర్వహించిన ఈద్ ఉల్ ఫితర్ రంజాన్ వేడుకలకు ఆయన అతిథిగా హాజరయ్యారు. ముస్లింల ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నేను ఎంపీ అయిన తరువాత ముస్లిం సోదరులకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం కమ్యూనిటీ హాల్, వారి పిల్లల ఉన్నత చదువుకు, పోటీ పరీక్షలకు అనుకూలంగా ఉండేలా స్టడీ సర్కిల్ కూడా ఈ భవనంలో నిర్మించనున్నామని తెలిపారు. దివంగత వైఎస్సార్ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ ప్రకటించి, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడానికి బాటలు వేశారని చెప్పారు. తండ్రికి తగ్గ తనయుడిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ముస్లిం మైనారిటీల సంక్షేమానికి మరిన్ని సదుపాయాలు, పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. 'పేద ముస్లిం పిల్లలకు' షాదీ ముబారక్ తోఫా' పథకం ద్వారా లక్ష రూపాయలను సీఎం జగన్ అందిస్తున్నారని ఎంపీ తెలిపారు. ముస్లింలు అంటే వైఎస్సార్ సీపీ అని, వైఎస్సార్ సీపీ అంటే ముస్లింల పార్టీ అని అన్నారు. ముస్లిం సోదరులకు ఏ సమస్య వచ్చినా, ఏ అవసరం వచ్చినా నేను ఎప్పుడూ మీ వెంటే ఉంటానని ఎంపీ భరత్ అన్నారు. ఈద్గా కమిటీ నాలుగెకరాలు కేటాయించాలని ఈ సభలో ఎంపీ భరత్‌ను కోరగా అందుకు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నక్కా నగేష్, వక్ఫ్ బోర్డు మాజీ అధ్యక్షుడు కరీమ్ ఖాన్, ప్రస్తుత అధ్యక్షుడు ఆరీఫ్, ఈద్గా కమిటీ అధ్యక్షుడు అమానుల్లా బేగ్, డాక్టర్ బేగ్, మదీనాబాషా తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఈద్గా గ్రౌండ్‌లో జరిగిన రంజాన్ వేడుకలకు రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి హాజరై ముస్లింలు శుభాకాంక్షలు తెలియజేశారు. అల్లా దీవెనలు, మీ చల్లని దీవెనలు ఎల్లప్పుడూ జగనన్న మీద ఉండాలని ఆకాంక్షించారు కరీం ఖాన్ ,అన్వర్ ,అమీర్ , రబ్బాని, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ భరత్, చందన నాగేశ్వర్, డీసీసీ చైర్మన్ ఆకుల వీర్రాజు

కడియం: బుర్రిలంక పీఎస్ఎం కన్వెన్షన్ అధినేత పాటంశెట్టి శ్రీనివాస చక్రవర్తి తన తల్లి దివంగత లక్ష్మి పేరిట ఏర్పాటు చేసిన ఉచిత ఆర్వో ప్లాంట్‌ను శనివారం రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్, రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు ప్రారంభించారు. శుద్ధి చేసిన తాగునీటిని ప్రజలకు ఉచితంగా అందించేందుకు లక్షలాది రూపాయలు వెచ్చించి ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు, నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు పుల్లా చంటియ్య, ఐఎస్ఏ మాజీ అధ్యక్షులు పల్లా సుబ్రహ్మణ్యం, నర్సరీ రంగ ప్రముఖులు మార్గాని సత్యనారాయణ, నరసయ్య, గోపాలం, ఆంజనేయులు, నాగశివాజీ, గోపాలకృష్ణ, రాము, వెంకట్రావు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని జ్ఞాన సరస్వతి పీఠం, గౌతమి ఘాట్ ఆధ్యాత్మిక సంస్థల సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో సరస్వతి ఘాట్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడం కోసం శ్రీజ్ఞాన సరస్వతి పీఠంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు శ్రీజ్ఞాన సరస్వతి పీఠం వ్యవస్థాపకులు తోట సుబ్బారావు, ప్రముఖ వాణిజ్య ప్రముఖులు రొంగల వెంకటఅప్పారావు, సామాజిక సేవకులు పాల్గొన్నారు.

సీపీఐ ఎంఎల్ ఆవిర్భావ దినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ: పీడిత ప్రజల కోసం సీపీఐ ఎంఎల్ నిరంతర పోరాటం సాగిస్తుందని సీపీఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ సభ్యురాలు పి.టాన్యా పేర్కొన్నారు. శనివారం నగరంలో మావో భవన్‌లో సీపీఐ(ఎంఎల్) ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం చేసిన పోరాటంలో ఎందరో అమరవీరులు నెలకొరిగారన్నారు.

మంత్రి వనితను కలసిన యువ నేత గణేష్



జక్కంపూడి గణేష్‌ను సత్కరిస్తున్న హోం మంత్రి వనిత

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో-ఆర్డినేటర్‌గా ఇటీవల నియమితులైన జక్కంపూడి గణేష్ శుక్రవారం కొవ్వూరు క్యాంపు కార్యాలయంలో హోం మంత్రి తానేటి వనితను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. మంత్రి వనిత ఈ సందర్భంగా గణేష్‌కు శాలువా కప్పి సత్కరించారు. రానున్న రోజుల్లో పార్టీ యువజన విభాగాన్ని మరింత పటిష్టం చేసే దిశగా కృషి చేయాలని మంత్రి సూచించారు. పార్టీ కార్యక్రమాల్లో యువత భాగస్వాములు అయ్యేలా కృషి చేయాలని గణేష్‌కు సలహా ఇచ్చారు. పార్టీ యువజన విభాగాన్ని మరింత పటిష్టం చేసేందుకు రీజియన్ పరిధిలోని జిల్లాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నానని గణేష్ తెలిపారు. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రీజినల్ కో-ఆర్డినేటర్ ఆనంద్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు వీరన్న పాల్గొన్నారు.

29న కోటి స్వర మహోత్సవం



సంగీత విభావరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ భరత్

రాజమహేంద్రవరం రూరల్: ఈ నెల 29న స్థానిక వేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో కోటి స్వరమహోత్సవం నిర్వహించనున్నారు. ఈ మహోత్సవానికి సంబంధించి పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ శనివారం నగరంలోని వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎంపీ భరత్ మాట్లాడుతూ ప్రముఖ సంగీత దర్శకులు దివంగత సాలూరి రాజేశ్వరరావు, ఆయన తనయుడు సాలూరి కోటేశ్వరరావు(కోటి) తెలియని సంగీత ప్రియులు, సినీ అభిమానులు ఉండరన్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు కోటి సమక్షంలో నిర్వహించే కోటి స్వర మహోత్సవం సంగీత విభావరి కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించడం ఆనందంగా ఉందని ఎంపీ భరత్ అన్నారు. కార్యక్రమ పర్యవేక్షకురాలు ఉమాదేవి, నిర్వాహకుడు పిరాట్ల శ్రీహరి, గాయని ప్రియా, మల్లాది రాజేశ్వర రావు మాట్లాడుతూ ఈ సినీ సంగీత విభావరిని ఈ నెల 29వ తేదీ శనివారం సాయంత్రం 4 గంటలకు వేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం, ఆనందానికి 'హ్యాపీ స్ట్రీట్'

- నేటి నుంచి జేఎన్ రోడ్డు ఏకేసీ కాలేజీ వద్ద ప్రారంభం
- ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ భరత్

రాజమహేంద్రవరం సిటీ: నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు అన్ని వయసుల వారికీ ఆహ్లాదం, వినోదం పంచేలా అన్ని రకాల ప్రదర్శనలతో ఆదివారం ఆనందంగా గడిపేందుకు హ్యాపీ స్ట్రీట్ ముస్తాబు చేసినట్టు ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటలకు ప్రారంభంకానున్న జేఎన్ రోడ్డు ఏకేసీ కళాశాల సమీపంలో ముస్తాబు చేసిన రోడ్డును ఎంపీ భరత్ శనివారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ పూణే, బొంబాయి నగరాలలో ఉండే హ్యాపీ స్ట్రీట్‌ను నగర వాసులకు పరిచయం చేస్తున్నామన్నారు. కాలంతో పాటు పరిగెడుతున్న మానవులకు విశ్రాంతి ఉండడం లేదని, కనీసం ఆదివారం ఆ ఒత్తిడి నుంచి బయటపడేటందుకు ఈ హ్యాపీ స్ట్రీట్ ఉపయోగపడుతుందని భావిస్తున్నామన్నారు. బాల్యంపై ఒత్తిడి పెరుగుతోందని వారంలో ఒక రోజైనా హాయిగా, ఉల్లాసంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ హ్యాపీ స్ట్రీట్ కాన్సెప్ట్ నగరంలో పెడుతున్నామన్నారు. వినోద కార్యక్రమాలుగా జుంబా డ్యాన్స్, యోగ, లైవ్ స్టేజ్, ఔట్ డోర్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, బాలల కోసం అనేక క్రీడా, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్టు ఎంపీ భరత్‌రామ్ తెలిపారు. ఒకటిన్నర కిలోమీటర్ల మేర వివిధ కళాకృతులతో శోభాయమానంగా తీర్చిదిద్దారమన్నారు. నగర వాసులంతా ఈ హ్యాపీ స్ట్రీట్ సందర్శించి, ఆదివారం ఆనందంగా గడపాలన్నదే తమ ఆకాంక్ష అని ఎంపీ భరత్‌రామ్ అన్నారు.

పడాల రామారావు జీవితం స్ఫూర్తిదాయకం

సీటీఆర్ఐ: స్వాతంత్ర్య సమరయోధుడు పడాల రామారావు జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక జాంపేటలోని ఉమా రామలింగేశ్వర స్వామి కల్యాణ మండపంలో తూర్పుగోదావరి జిల్లా అభ్యుదయ రచయితల సంఘం(అరసం), జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పడాల రామారావు శతజయంత్యుత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పడాల రామారావు విగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ చైర్మన్ ఆళపు రామలింగేశ్వర రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూర్వపు ఆంధ్రప్రదేశ్ పోస్టుమాస్టర్ జనరల్ ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తనకు పడాల జీవిత చరిత్ర, వారి గొప్పతనం తెలిసి ఈ కార్యక్రమానికి ఢిల్లీ నుంచి వచ్చానని తెలియజేశారు. పడాల వీరభద్రరావు, ఎం.వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నేడు గోపాలుని నిత్యమాస కల్యాణం

అనపర్తి: మండలంలోని పొలమూరులో వేంచేసి వున్న రుక్మిణి సత్యభామ సమేత శ్రీమదనగోపాల స్వామి వారి నిత్యమాస కల్యాణం ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. రోహిణి నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి నెలా వైఖానస ఆగమ విధానంలో స్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తుంటారు. దీంట్లో భాగంగా ఆదివారం ఉదయం 7 గంటలకు వేడుకలు ప్రారంభంకానున్నాయి.

ధాన్యం రవాణాకు చర్యలు

- జేసీ తేజ్‌భరత్
- కడియం ఆవలో పర్యటన

కడియం: ధాన్యం రవాణాలో రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సిబ్బందిని జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ ఆదేశించారు. శనివారం ఉదయం ఆయన కడియంలోని ఆవ ప్రాంతంలో పర్యటించారు. స్థానిక రైతులతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ధాన్యం రవాణా విషయంలో తమకు అందుతున్న ఫిర్యాదుల నేపథ్యంలో స్వయంగా పరిశీలించేందుకు వచ్చినట్టు జేసీ తెలిపారు. ఈ సందర్భంగా జేసీ తేజ్‌భరత్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం సేకరణ పూర్తిగా ఆన్‌లైన్ నమోదు విధానం ద్వారానే సాగుతుంది. గత ఖరీఫ్‌లో ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసిన లావాదేవీలకు ఇంకా 512 మెట్రిక్ టన్నులకు చెల్లింపులు జరగలేదన్నారు. వీటిని సంబంధిత మిల్లర్ ద్వారా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రవాణా సదుపాయం అందుబాటులో లేని భూముల నుంచి ధాన్యాన్ని ఎడ్ల బళ్ల ద్వారా రవాణా చేసుకునేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, రైతుల నుంచి సూచనలు స్వీకరించారు. రైతుకు మద్దతు ధర లభించేలా పకడ్బందీగా కొనుగోళ్లు నిర్వహిస్తున్నట్లు జేసీ చెప్పారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, డీఎస్‌వో పి.ప్రసాదరావు, ఏయం త్రినాథరావు, తహసీల్దార్ ఎం.సుజాత, వైఎస్సార్ సీపీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు(బాబు), మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, భీమిరెడ్డి వెంకట్రావు, ఆర్ఎస్ఎన్ మూర్తి, స్థానిక రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రవహించే గోదావరి జీవన విధానానికి సంకేతం



కార్యక్రమంలో మాట్లాడుతున్న రంగ రామానుజా చార్యులు పాల్గొన్న ప్రముఖులు

సీటీఆర్ఐ: ప్రవహించే గోదావరి మానవ జీవన విధానానికి సంకేతమని రాష్ట్రపతి పురస్కారగ్రహీత, మహోమహోపాధ్యాయులు డాక్టర్ సముద్రాల రంగరామానుజాచార్యులు అన్నారు. శనివారం ఆచార్య బేతవోలు రామబ్రహ్మం రచించిన కొత్త గోదావరి, ఇతర కృతులు, కథలు పుస్తక పరిచయ కార్యక్రమం స్థానిక వైజంక్షన్‌లోని ఆనం రోటరీ హాల్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగరామానుజాచార్యులు తన మంగళాశాసనాలు తెలియజేశారు. ఆచార్యులు డాక్టర్ అద్దంకి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధునిక యుగంలో జీవితం ఎలా మార్పు చెందనుంది, వీటికి సంకేతం ఏంటి అనే విషయం గోదావరితో ముడిపడిలా చక్కగా రాశారన్నారు. రామబ్రహ్మం ఈ కొత్త గోదావరి పుస్తకంలో అనేక చమత్కారాలను ఉపయోగించారన్నారు. సాహితీ గౌతమీ అధ్యక్షుడు, విశ్రాంత ఓఎన్‌జీసీ జీఎం పి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ తెలుపు, ఎరుపు రంగులతో మొదలైన రాజకీయాలు ఇప్పుడు విభిన్న రంగులతో రంగు మార్చినా కానీ రాజకీయం మాత్రం ఖూనీ అవుతోందని ఆయన ఇతర కృతులు, కథలలో విశ్వదాభిరామ వినుర వేమ అనే పద్యంలో చెప్పడం నేటి రాజకీయాలకు అద్దం పడుతుందన్నారు. రచయిత బేతవోలు రామబ్రహ్మం మాట్లాడుతూ ఇక్కడ ప్రవహించే గోదావరి నది ఒక్కోసారి ఒక్కో రంగులోకి మారుతుందన్నారు. ప్రశాంతంగా తెల్లగా ఉన్నప్పుడు అవధూతలాగా కనబడుతూ, ఎర్ర రంగు వచ్చినప్పుడు విప్లవ జ్యోతిలాగా కనబడుతుందన్నారు. గోదావరిని కొత్తగా ఆవిష్కరించారన్నారు. సాహితీ గౌతమి అధ్యక్షుడు విజయ్ కుమార్‌కి ప్రత్యేక అభినందనలు తెలియచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అద్దంకి శ్రీనివాస్, సాహితీ గౌతమి కార్యదర్శి దినవహి బాపిరాజు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

24 నుంచి వేసవి క్రీడా శిక్షణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీకే విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: వేసవి సెలవులు వృథా కాకుండా విద్యార్థులకు రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో ఈ నెల 24వ తేదీ నుంచి మే నెల 24వ తేదీ వరకూ వివిధ క్రీడల్లో శిక్షణ అందజేస్తున్నట్టు స్కూల్ చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి ప్రకటించారు. శనివారం నగరంలో రాజమహేంద్రి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొమ్మూరు నుంచి కేశవరం వెళ్లే రోడ్డులోని సంపత్ నగర్ ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్‌లోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ వేసవిలో విద్యార్థులకు ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్, హ్యాండ్ రైటింగ్, కిక్ బాక్సింగ్, కరాటేతో పాటు ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్, వెస్టన్ డ్యాన్స్, హార్స్ రైడింగ్, రైఫిల్ షూటింగ్, స్కేటింగ్, ఆర్చరీలలో శిక్షణ ఇవ్వనున్నట్టుతెలిపారు. ఈ తరగతులు ఉదయం 8.30 గంటల నుంచి 11.30 వరకు ఉంటాయన్నారు. ఈ అవకాశం పాఠశాలల విద్యార్థులకు ఉంటుందని, శిక్షణార్థులకు ఉచిత బస్ సౌకర్యం కల్పించామని తెలిపారు. రాజమహేంద్రవరం, మండపేట, అనపర్తి తదితర సమీప గ్రామాలకు చెందిన అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వివరాలకు 7382237999లో సంప్రదించాలని విశ్వేశ్వరరెడ్డి కోరారు. ఈ సమావేశంలో రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ రెసిడెంట్ డైరెక్టర్ స్వరూప్ రెడ్డి, ప్రిన్సిపాల్ టీవీడీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికే అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- నిడిగట్లలో గడప గడపకూ మన ప్రభుత్వం



నిడిగట్లలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల సంక్షేమం, అభివృద్ధికే అధిక ప్రాధాన్యమిస్తున్నారని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. శనివారం కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామంలో రెండో రోజు శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి, వారు పొందిన లబ్ధిని తెలియజేశారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం రాత్రి వరకూ కొనసాగింది. 120 గడపలకు వెళ్లి అందరినీ ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో రాజానగరం జెడ్పీటీసీ వాసంశెట్టి పెద్ద వెంకన్న, వైఎస్సార్ సీపీ నాయకులు నాళం రోషయ్య, యడ్ల సత్యనారాయణ, పళ్ల కృష్ణ, కొల్లం రాజారమాదేవి, వల్లభశెట్టి బాబ్జి, గొంతు లక్ష్మణ్, బధిరెడ్డి యేసు, పళ్ల చిన్న తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసిన దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి పలువురు భక్తులు శనివారం విరాళాలు సమర్పించారు. రాజమండ్రి కోదండ రామాలయం ప్రాంతానికి చెందిన చలుమూరు వెంకట మహేష్ కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబును కలిసి నిత్యాన్నదానానికి రూ.1.08 లక్షల విరాళాన్ని అందజేశారు. విజయవాడ ఇస్లాంపేటకు చెందిన ఇట్లా అశోక్‌కుమార్, రమ్యశృతి నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం దాతలకు ఆలయ పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, కేసరి నాగమణి, బచ్చు మాధవీకృష్ణ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.